సాక్షి నంద్యాల

ఆదివారం । 28 । ఏప్రిల్ । 2024



మద్దిలేటయ్యలో భక్తుల రద్దీ

బేతంచెర్ల: మద్దిలేటి నరసింహస్వామి క్షేత్రం శనివారం భక్తులతో కిటకిటలాడింది. భక్తులు స్వామి వారికి వివిధ సేవలు నిర్వహించడంతో రూ.7,58,605 ఆదాయం వచ్చింది.



శ్రీమఠంలో సినీ నటుడు సుదీప్

మంత్రాలయం: కన్నడ సినీ నటుడు సుదీప్ శనివారం మంత్రాలయం వచ్చారు. గ్రామ దేవత మంచాలమ్మకు మొక్కులు తీర్చుకున్న అనంతరం రాఘవేంద్రస్వామిని దర్శించుకున్నారు.



మల్లన్నకు నృత్యార్చన

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల ఆలయ నిత్యకళావేదికపై హైదరాబాద్‌కు చెందిన శాంకరీ నాట్యశాల వారి సంప్రదాయ నృత్యప్రదర్శన భక్తులను ఆకట్టుకుంది.

న్యూస్‌రీల్

ప్రశాంతంగా పాలిసెట్



డోన్‌లో పరీక్ష రాసేందుకు వెళ్తున్న విద్యార్థులు

నంద్యాల(న్యూటౌన్): నంద్యాల జిల్లాలో శనివారం పాలిసెట్–2024ను ప్రశాంతంగా నిర్వహించారు. పాలిటెక్నిక్ కళాశాలలో ప్రవేశానికి జిల్లాలో 18 కేంద్రాల్లో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పరీక్ష నిర్వహించినట్లు పాలిసెట్ డిస్ట్రిక్ట్ కో ఆర్డినేటర్ సీహెచ్ శ్రీనివాసప్రసాద్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నంద్యాలలో 4,181 మంది విద్యార్థులకు గాను 3,716 మంది హాజరు కాగా శ్రీశైలం కేంద్రంలో 152 మందికి గాను 128, బేతంచెర్లలో 1,143 మందిలో 1,012 మంది హాజరయ్యారు. మొత్తం మీద నంద్యాల జిల్లాలో 5,476 మంది దరఖాస్తు చేసుకోగా 4,857 మంది హాజరయ్యారు. ఇందులో బాలురు 90 శాతం, బాలికలు 85.8 శాతం హాజరయ్యారు. వేసవి ఎండలతో తగిన జాగ్రత్తలను తీసుకుంటూ పోలీసు బందోబస్తుతో పకడ్బందీగా పరీక్షలు నిర్వహించామన్నారు. ఇందుకు సహకరించిన కాలేజీ సిబ్బందికి, రెవెన్యూ, పోలీసు, మెడికల్, ఆర్టీసీ, విద్యుత్, మున్సిపల్ సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు.

వడదెబ్బకు గురికాకుండా జాగ్రత్తలు తీసుకోండి

చాగలమర్రి: ఎండలు తీవ్రంగా ఉండటంతో ఉపాధి హామీ పనుల కూలీలు వడదెబ్బ బారిన పడకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని డ్వామా పీడీ రామచంద్రారెడ్డి అన్నారు. శనివారం ఆయన గోట్లూరు, మల్లెవేముల గ్రామాల్లో ఉపాధి పనులను పరిశీలించి కూలీలతో మాట్లాడారు. ఉదయం 5.30 గంటలకు పనికి హాజరై ఉదయం 10.30 గంటలకు పని ముగించుకుని ఇంటికి వెళ్లాలని సూచించారు. అలాగే శరీరంలో తేమ శాతం తగ్గకుండా ఓఆర్ఎస్ పొడిని నీటిలో కలుపుకుని తాగాలన్నారు. ఉపాధి కూలీ వేతనాన్ని రూ.300లకు పెంచిందన్నారు. పీడీ వెంట ఫీల్డ్ అసిస్టెంట్ రవి, మేటీలు ఉన్నారు.

ప్రైవేటు ఆసుపత్రులు నిబంధనలు పాటించాలి

- జిల్లా వైద్యారోగ్యాధికారి డాక్టర్ వెంకట రమణ

నంద్యాల టౌన్: ప్రైవేట్ ఆసుపత్రులు ఫైర్ సేఫ్టీ నిబంధనలు కచ్చితంగా పాటించాలని, లేని పక్షంలో కఠిన చర్యలు తప్పవని జిల్లా వైద్యారోగ్యాధికారి డాక్టర్ వెంకట రమణ హెచ్చరించారు. రాష్ట్ర వైద్యారోగ్యశాఖ ఆదేశాల మేరకు శనివారం ఆయన నంద్యాల పట్టణంలోని పలు ప్రైవేట్ ఆసుపత్రులను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫైర్ ఎన్‌ఓసీ, క్లినికల్ ఎస్టాబ్లిష్మెంట్ యాక్ట్ ప్రకారం ఉండవలసిన అన్ని డాక్యుమెంట్లు తప్పనిసరిగా ప్రతి ఆసుపత్రిలో అందుబాటులో ఉంచాలన్నారు. ఆసుపత్రికి వచ్చిన రోగులకు వైద్యం చేయటానికి ఎంత ప్రాధాన్యత ఇస్తామో వారి రక్షణకు కూడా అంతే ప్రాముఖ్యత ఇవ్వాలన్నారు. స్కానింగ్ సెంటర్లు, డయాగ్నోస్టిక్ సెంటర్లు ఎప్పటికప్పుడు లైసెన్స్‌లు రెన్యూవల్ చేయించుకోవాలన్నారు. వైద్యారోగ్య శాఖ వద్ద నమోదు కాని ఒక ప్రైవేట్ ఆసుపత్రిని తనిఖీ చేసి షోకాజ్ నోటీస్ ఇచ్చామన్నారు. ఆయన వెంట డెమో ఆఫీసర్ రవీంద్ర నాయక్ ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

గురుకులాల్లో మిగులు సీట్ల భర్తీకి రేపు కౌన్సెలింగ్

నంద్యాల(న్యూటౌన్): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల విద్యాలయాల్లో 5వ తరగతిలో మిగులు సీట్ల భర్తీకి ప్రవేశ పరీక్షలో పొందిన మార్కుల ఆధారంగా ఈనెల 29వ తేదీన 1.3 నిష్పత్తిలో కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు ఉమ్మడి జిల్లాల కో ఆర్డినేటర్ డాక్టర్ ఐ.శ్రీదేవి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కర్నూలు సమీపంలోని దిన్నెదేవరపాడు గురుకుల పాఠశాలలో నిర్వహించే కౌనెల్సింగ్‌కు హాజరు కావాలన్నారు.

మాకొద్దు టీడీపీ

- అధికార వైఎస్సార్‌సీపీలోకి వెల్లువలా వలసలు
- ప్రతి రోజు వందల సంఖ్యలో చేరికలు
- టీడీపీ ఆవిర్భావం నుంచి ఉన్న వారు సైతం బైబై
- ఫరూక్ వ్యవహారశైలితో ఖాళీ అవుతున్న పార్టీ

శిల్పా మోహన్‌రెడ్డి, పీపీ నాగిరెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరిన యాళ్లూరుకు చెందిన టీడీపీ నాయకులు (ఫైల్)



సాక్షి, నంద్యాల: సార్వత్రిక ఎన్నికల వేళ నంద్యాల నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. పోలింగ్‌కు సమయం దగ్గరపడుతున్న కొద్దీ ఆ పార్టీని వీడి కార్యకర్తలు వెళ్లిపోతున్నారు. పార్టీ ఆవిర్భావం నుంచి టీడీపీలో ఉన్నా తమకు ఒరిగిందేమీలేదని మదనపడుతున్నారు. ఈ నేపథ్యంలో ప్రతి రోజు పార్టీని వీడి అధికార వైఎస్సార్‌సీపీలోకి వెల్లువలా వెళ్తున్నారు. మున్సిపాలిటీ పరిధిలోని ప్రతి వార్డు నుంచి కనీసం 300 మందికి తక్కువకాకుండా అధికార పార్టీలోకి చేరికలు కొనసాగుతున్నాయి. పార్టీని వీడి వెళుతున్న వారిని నిలుపుకునేందుకు చేస్తున్న ప్రయత్నాలేవీ సత్ఫలితాలివ్వడం లేదు. ఇటీవల ప్రతి రోజు కనీసం మూడు వందల మంది వైఎస్సార్‌సీపీలోకి చేరుతున్నారు. ఈ మధ్యే టీడీపీ ద్వితీయ శ్రేణి నాయకులు మస్తాన్ బాబా, గౌస్, ఖాజాబాబా, హారున్, షేక్ అబ్దుల్లా, ఖాజా, షేక్షావలి తదితరులు పార్టీని వీడి ఫ్యాన్ కిందకు చేరారు. జనసేన రాష్ట్ర ప్రోగ్రాం నిర్వహణ కమిటీ కార్యదర్శి విశ్వనాథ్‌తో పాటు వెయ్యి మంది కార్యకర్తలు వైఎస్సార్‌సీపీలో చేరడం విశేషం. అధికార వైఎస్సార్‌సీపీలోకి వస్తున్న చేరికలను చూస్తుంటే ఎన్నికలకు ముందే పార్టీ గెలుస్తున్నట్లుగా ఉందని రాజకీయ పరిశీలకులు అభిప్రాయపడుతున్నారు. నంద్యాల అసెంబ్లీ స్థానం మొదటి నుంచి వైఎస్సార్ సీపీకి కంచుకోట. వైఎస్సార్‌సీపీ ఆవిర్భావం నుంచి జరిగిన అన్ని ఎన్నికల్లోనూ పార్టీ గెలుస్తూ వచ్చింది. 2014, 2019లో భారీ మెజారిటీతో టీడీపీ అభ్యర్థులపై వైఎస్సార్‌సీపీ గెలిచింది. 2017లో జరిగిన ఉప ఎన్నికల్లో మాత్రం కొన్ని ప్రత్యేక పరిస్థితుల్లో టీడీపీ గెలుపొందింది. 2019లో టీడీపీ అభ్యర్థి భూమా బ్రహ్మానందరెడ్డి మీద వైఎస్సార్‌సీపీ శిల్పా రవిచంద్రకిశోర్ రెడ్డి భారీ మెజారిటీతో గెలుపొందారు. నాటి నుంచి నేటి వరకు టీడీపీ గ్రాఫ్ ఏమాత్రం మెరుగుపడకపోవడం గమనార్హం.



శిల్పా రవిచంద్ర కిశోర్‌రెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరిన 12వ వార్డు టీడీపీ శ్రేణులు (ఫైల్)

దూరమవుతున్న ముస్లింలు

బీజేపీతో టీడీపీ జతకట్టడంపై ముస్లిం మైనారిటీలు తీవ్ర ఆగ్రహంతో ఉన్నారు. దివంగత సీఎం వైఎస్సార్ తమకు ఇచ్చిన రిజర్వేషన్లను రద్దు చేస్తామని బీజేపీ నాయకులు బాహాటంగా చెబుతున్నా టీడీపీ ఖండించకపోవడంపై రగిలిపోతున్నారు. ముస్లింల మనోభావాలు దెబ్బతీసేలా పీఎం నరేంద్ర మోదీతో పాటు కేంద్ర హోంమంత్రి అమిత్‌షా తరచూ వ్యాఖ్యానిస్తున్నా టీడీపీ నాయకులు తేలుకుట్టిన దొంగల్లా ఉంటున్నారని.. బీజేపీ అధికారంలోకి వస్తే తమ పరిస్థితి తలుచుకుంటేనే భయమేస్తోందని ముస్లింలు అంటున్నారు. ఈ నేపథ్యంలో ముస్లిం మైనారిటీలు పెద్ద ఎత్తున వైఎస్సార్‌సీపీలోకి క్యూ కడుతున్నారు. నియోజకవర్గంలో గత ఎన్నికలకు మించి ఈ దఫా భారీ మెజారిటీ తీసుకువచ్చేందుకు మాజీ మంత్రి శిల్పా మోహన్ రెడ్డి తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. ప్రతి రోజు స్థానిక నాయకులతో మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో ఉన్న సమస్యలను తెలుసుకుంటూ వాటిని వెంటనే పరిష్కరిస్తున్నారు. ఎమ్మెల్యే శిల్పా వివాద రహితుడు కావడంతో పాటు నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయ డంతో ప్రజలంతా వైఎస్సార్‌సీపీ వైపు మొగ్గు చూ పుతున్నారు. ఈ నేపథ్యంలో స్వచ్ఛందంగా టీడీపీ, జనసేనలను వీడి అధికార పార్టీలోకి వస్తున్నారు.

ఫరూక్ తీరు నచ్చక..

నంద్యాల టీడీపీ అభ్యర్థి మాజీ మంత్రి ఫరూక్ వ్యవహారశైలితో సొంత పార్టీ నాయకులు, కార్యకర్తలు విసిగెత్తిపోతున్నారు. ఫరూక్ ప్రసంగాలు ఏమాత్రం ఆకట్టుకునే రీతిలో సాగడం లేదు. ఆయన ఏం మాట్లాడుతున్నాడో మాకే అర్థం కావడం లేదని అనుచరులే పేర్కొంటున్నారు. ఒక వర్గం వారికి మాత్రమే ఆయన ప్రాధాన్యత ఇస్తున్నారని, ఇతరులను అస్సలు పట్టించుకోవడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. మాజీ ఎమ్మెల్యే భూమా బ్రహ్మానందరెడ్డి సైతం ఫరూక్‌కు సహాయ నిరాకరణ చేస్తుండడంతో ఈ ఎన్నికలలో ఫరూక్ ఓటమి ఖాయమనే చర్చ నడుస్తోంది. దీంతో పార్టీ క్యాడర్‌లో నిరుత్సాహం నెలకొంది.

వైఎస్ఆర్ పెన్షన్ కానుకకు రూ.139.82 కోట్లు

కర్నూలు(అగ్రికల్చర్): మే నెల పింఛన్ల పంపిణీకి ఉమ్మడి కర్నూలు జిల్లాకు రూ.139.82 కోట్లు విడుదలయ్యాయి. 4,68,742 పింఛనుదారులకు ఈ మొత్తం పంపిణీ చేయనున్నారు. ఈ నెల 30న బ్యాంకుల నుంచి వార్డు, గ్రామ సచివాలయ సెక్రటరీలు, వెల్ఫేర్ అసిస్టెంట్లు సంబంధిత బ్యాంకుల నుంచి పెన్షన్ నిధులను డ్రా చేస్తారు. మే నెల 1 నుంచి పింఛన్లను పంపిణీ చేస్తారు. కర్నూలు జిల్లాలో 2,46,340 పింఛన్లకు రూ.73,74,49,500.. నంద్యాల జిల్లాలో 2,22,402 పింఛన్లకు రూ.66,08,47,000 పంపిణీ చేయనున్నారు. ఏప్రిల్ నెల తరహాలోనే మే నెలలో కూడా పంపిణీ చేసే అవకాశం ఉంది. అయితే స్పష్టత రావాల్సి ఉన్నట్లు డీఆర్‌డీఏ–వైకేపీ అధికారులు తెలిపారు.

నిప్పుల గుండం

కర్నూలు(అగ్రికల్చర్): ఎండల తీవ్రతకు ఉమ్మడి జిల్లా నిప్పుల గుండంగా మారుతోంది. ఎండలు, వడగాడ్పుల తీవ్రత గరిష్ట స్థాయికి చేరుతున్నాయి. నంద్యాల జిల్లాలో ఎండల తీవ్రత మరింత ఆందోళనకరంగా ఉంటోంది. నంద్యాల జిల్లాలోని ఆరు మండలాల్లో 45 డిగ్రీలకుపైగా ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. 8 మండలాల్లో 44 డిగ్రీలకుపైగా నమోదు కావడం గమనార్హం. కర్నూలు జిల్లాలో 4 మండలాల్లో 44 డిగ్రీలకుపైగా ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఎండలు, వడగాడ్పుల తీవ్రతకు కర్నూలు, నంద్యాల జిల్లాలు విలవిల్లాడుతున్నాయి. చాగలమర్రిలో 45.9, డోన్‌లో 45.8, బనగానపల్లిలో 45.8, మహానందిలో 45.3, ఆళ్లగడ్డలో 45, గడివేములలో 45 డిగ్రీల ప్రకారం ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. కోడుమూరులో 44.8, కొత్తపల్లిలో 44.6, ఆత్మకూరులో 44.6, బండిఆత్మకూరులో 44.6, కర్నూలులో 44.5, రుద్రవరంలో 44.5, పాణ్యంలో 44.4, కల్లూరులో 44.3, గూడూరులో 44.2, కొలిమిగుండ్లలో 44.2, నందకొట్కూరులో 44.2, సంజామలలో 44 డిగ్రీల ప్రకారం ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఎండలు, వడగాడ్పుల తీవ్రత ఈ నెల చివరి వరకు కొనసాగే అవకాశం ఉన్నట్లు రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ అధికారులు ప్రకటించారు.

సంక్షేమం, అభివృద్ధే లక్ష్యం



డోన్ పూలబజార్‌లో ఎన్నికల ప్రచారం చేస్తున్న మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి

- వైఎస్సార్‌సీపీ మేనిఫెస్టోతో పేదలకు మరింత మేలు
- ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి

డోన్: పేదల సంక్షేమమే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మేనిఫెస్టో రూపొందించి విడుదల చేశారని ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి అన్నారు. రాష్ట్ర మీట్ కార్పొరేషన్ చైర్మన్ శ్రీరాములు, పార్టీ పట్టణ అధ్యక్షులు కురుకుంద హరి, పార్టీ జిల్లా విభాగం బీసీ అధ్యక్షులు పోస్టుపసాద్, యువజన విభాగం అధ్యక్షులు ఆర్ఈ రాజవర్ధన్, కౌన్సిలర్లు కటిక వేణు, కురుకుంద పద్మావతి, వెంకటేశ్వరమ్మ, శివలక్ష్మిల ఆధ్వర్యంలో డోన్ 2వ వార్డు నుంచి 6 వార్డు వరకు శనివారం మంత్రి బుగ్గన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా పాతపేట, పూలబజార్, దస్తగిరి స్వామి చౌక్, రాములదేవాలయం ప్రాంతాల్లో ప్రజలకు అభివాదం చేస్తూ వచ్చే ఎన్నికల్లో ఎంపీ అభ్యర్థిగా పోచా బ్రహ్మానందరెడ్డిని, ఎమ్మెల్యేగా తనను అఖండ మెజార్టీతో గెలిపించాలని అభ్యర్థించారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆశీస్సులతో ఉమ్మడి కర్నూలు జిల్లా అభివృద్ధి పథంలో పయనించిందని అన్నారు. లా యూనివర్సిటీ, సిల్వర్ జూబ్లీ కళాశాలకు నూతన భవనం, నంద్యాలలో మెడికల్ కాలేజ్, నందికొట్కూరు ప్రాంతంలో పారిశ్రామికవాడ, కల్లూరు ప్రాంతంలో అనేక చిన్నతరహా పరిశ్రమలు ఏర్పాటుకు ప్రభుత్వం కృషి చేసిందన్నారు. ఓర్వకల్లు విమానాశ్రయ ఏర్పాటుతో పాటు అనేక సోలార్ ప్రాజెక్టులను చేపట్టి వేలాది మంది యువతకు ఉపాధి కల్పించిందన్నారు. ఏదైతే చేయగలమో అదే చెప్పి చేసి చూపించే తెగువ గల ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. ఈ ఎన్నికల సందర్భంగా పార్టీ విడుదల చేసిన మేనిఫెస్టో పేదలకు మరింత మేలు చేస్తుందని ఆయన అన్నారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ఇచ్చిన హామీలను అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఎందుకు నెరవేర్చలేకపోయారో ప్రజలకు చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రతి ఇంటికి వైఎస్ఆర్‌సీపీ ప్రభుత్వం మేలు చేసి వుంటేనే ఓట్లు వేయాలని సీఎం ధైర్యంగా ఓట్లు అడుగుతుండటం బహుషా దేశంలోనే మన రాష్ట్రంలోనే ప్రథమమన్నారు. ఇలాంటి నాయకుడు మన రాష్ట్రానికి లభించడం ప్రజలు చేసుకున్న అదృష్టమన్నారు. వచ్చే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటేయ్యాలని స్థానికులను మంత్రి అభ్యర్థించారు.

ఓపెన్ స్కూల్ సప్లిమెంటరీ పరీక్ష ఫలితాలు విడుదల

నంద్యాల(న్యూటౌన్): ఏపీ ఓపెన్ స్కూల్ పది, ఇంటర్మీడియెట్ పరీక్షల ఫలితాలు విడుదలైనట్లు ఓపెన్ స్కూల్ కో ఆర్డినేటర్ లక్ష్మీనారాయణ శనివారం తెలిపారు.https://apopen school.ap.gov.in వెబ్‌సైట్‌లో మార్కులు తెలుసుకోవచ్చునన్నారు. ఇంటర్ పరీక్షలకు జిల్లా వ్యాప్తంగా 5,777 మంది విద్యార్థులు హాజరు కాగా 1,445 మంది ఉత్తీర్ణత సాధించారు. పదవ తరగతిలో 1,404 మంది విద్యార్థులకు గాను 209 మంది ఉత్తీర్ణత సాధించారు. పది, ఇంటర్ పరీక్షల్లో తప్పిన విద్యార్థుల కోసం జూన్ 1 నుంచి 8వ తేదీ వరకు పరీక్షలు నిర్వహిస్తారు. ఈ పరీక్షకు అపరాధ రుసుం లేకుండా ఈ నెల 29 నుంచి మే 4వ తేదీ వరకు చెల్లించవచ్చు. అపరాధ రుసుంతో మే 5 నుంచి 8వ తేదీ వరకు, తత్కాల్ విధానంలో మే 9, 10 తేదీల్లో పరీక్ష ఫీజును చెల్లించేందుకు గడువు ఇచ్చారు.

కౌంటింగ్ కేంద్రాల పరిశీలన



ఆర్‌జీఎంలో సౌకర్యాలపై ఆరా తీస్తున్న కలెక్టర్ శ్రీనివాసులు, ఎన్నికల ప్రత్యేక పరిశీలకులు, చిత్రంలో ఎస్పీ రఘువీర్‌రెడ్డి, జేసీ రాహుల్‌కుమార్‌రెడ్డి

పాణ్యం: సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా పోలింగ్ అనంతరం ఈవీఎంలు, వీవీప్యాట్‌లు భద్రపరిచే స్ట్రాంగ్ రూమ్‌లు, ఓట్లు లెక్కించే కౌంటింగ్ కేంద్రాలను నంద్యాల జిల్లా కలెక్టర్ శ్రీనివాసులు, సాధారణ ఎన్నిక పరిశీలకులు పంకజ్‌కుమార్, దినేష్‌కుమార్, పోలీసు పర్యవేక్షలు హిమాన్సి శంకర్ త్రివేదితో పాటు జిల్లా ఎస్పీ రఘువీర్ రెడ్డి కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ స్ట్రాంగ్ రూమ్, ఓట్ల లెక్కింపు, రిసెప్షన్ కేంద్రాల వద్ద గట్టి బందోబస్తు నిర్వహించాలన్నారు. ఆర్జీఎం కళాశాలలో నందికొట్కూరు, శ్రీశైలం, శాంతిరాం ఇంజినీరింగ్ కళాశాలలో ఆళ్లగడ్డ, బనగానపల్లె, నంద్యాల, ఫార్మసీ కళాశాలలో డోన్ నియోజకవర్గానికి సంబంధించి ఓట్ల లెక్కింపు ఉంటుందన్నారు. స్ట్రాంగ్ రూమ్‌లను పరిశీలించిన తర్వాత అక్కడి సిబ్బందికి పలు ఆదేశాలు జారీ చేశారు. ఎలాంటి లోపాలు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వారి వెంట నంద్యాల డోన్, ఆత్మకూర్ ఆర్డీఓలు మల్లికార్జున రెడ్డి, మహేశ్వరరెడ్డి, మిర్యాలదాసు, అధికారులు, పోలీసులు పాల్గొన్నారు.

గేమ్ చేంజర్

సకల జనుల సంక్షేమం



పాదయాత్రలో పేదల కన్నీటిసెగ గుండెను తాకింది...రైతు భరోసా యాత్రలో రైతుల ఆక్రందన మనసును కలిచివేసింది....జబ్బుచేస్తే చికిత్స చేయించుకోలేక ప్రాణాలు కోల్పోతున్న ఘటనలు కన్నీరు తెప్పించాయి.. పాదయాత్రలో ప్రతీ పల్లెలో ప్రతీ గుండెచప్పుడు విన్నాడు.. ప్రతీ ఆక్రందన ఆలకించారు. రాజు, పేద బతుకులో తేడాను కళ్లారా చూశారు. అందుకే తనని నమ్మి పాలన ఇచ్చిన ప్రజలకు 'నవరత్నాల'తో ఐదేళ్ల బంగారు జీవితం ఇచ్చారు. ఇప్పుడు రెండు అడుగులు ముందుకేసి వాటికి మరింత వన్నె తెచ్చి సకల జనుల సంక్షేమమే లక్ష్యంగా, పేదలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ మేనిఫెస్టోను రూపొందించారు ఆ పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి. ఎన్నికలకు 15 రోజుల ముందు ఐదేళ్ల పాలన ఎలా ఉండబోతోందో వివరించారు. 'చేసేదే చెప్తాను. చెప్పింది చేస్తాను' అని తన ప్రజలకు మనసులోని మాటను నిర్భయంగా చెప్పి విశ్లేషకులతో పాటు అన్ని వర్గాల నుంచి 'భేష్' అనిపించుకున్నారు.

– సాక్షి బృందం

పేదరిక నిర్మూలనకు దోహదం



జగనన్న ప్రవేశపెట్టిన నవరత్నాలు ప్లస్ రాష్ట్రంలో 70 శాతం పేద బడుగు, బలహీన వర్గాలకు ఆర్థికంగా అభివృద్ధి చెందడంతో దాంతో పాటు రాష్ట్రాభివృద్ధి కూడా దోహదపడుతుంది. పేదలు ఆర్థికంగా ఎదిగితే రాష్ట్రం కూడా అభివృద్ధి చెందుతుంది. పేదరికాన్ని నిర్మూలించేందుకు నవరత్నాలు ఎంతో మేలు చేస్తాయి.

– చంద్రశేఖర్‌రెడ్డి, రిటైర్డు జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్, నంద్యాల

చెప్పాడంటే చేస్తాడంతే



వైఎస్సార్ కాపునేస్తం పథకాన్ని మళ్లీ కొనసాగిస్తానని సీఎం జగన్ హామీ ఇవ్వడం ఎంతో ఆనందానిచ్చింది. అగ్రవర్ణ పేదలకు గతంలో నాలుగేళ్లలో రూ.60 వేలు ఇచ్చారు. ఒక్క రూపాయి అవినీతి లేకుండా నేరుగా మా బ్యాంకు ఖాతాల్లో జమ చేశారు. పారదర్శక పాలనకు ఇంతకంటే ఏం రుజువుకావాలి. ఏదైనా చెబితే చేయగలగాలి. చేయలేనప్పుడు ఎన్ని హామీలిచ్చినా లాభం లేదు. జగన్ మాత్రం చెప్పాడంటే చేస్తాడంతే.

– నాగేంద్రమ్మ, శిరివెళ్ల

జగనన్నతో దళితుల కల నెరవేరబోతుంది



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 2024 ఎన్నికల మేనిఫెస్టోలో దళితులే ఆయా ప్రాంతాలలో రాజ్యాధికారాన్ని చేపట్టేందుకు అవకాశం కల్పించడం హర్షించదగ్గ విషయం. ఒక గ్రామంలో ఉన్న జనాభాలో కనీసం 50 శాతం దళితులు ఉండి, అందులో 500 మంది జనాభా కలిగి ఉన్న వాడలలో దళితులనే సర్పంచ్‌లుగా, వార్డు సభ్యులుగా, ప్రజా ప్రతినిధులుగా చేయించేందుకు వైఎస్సార్‌సీపీ కట్టుబడి ఉందని వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రకటించడం హర్షణీయం.

– శోభన్‌బాబు, శ్రీశైలంప్రాజెక్ట్

రూ.3లక్షల వరకు పెంపు హర్షణీయం



పొదుపు మహిళల కోసం రూ.3లక్షల వరకు సున్నా వడ్డీ రుణాలు పెంచడం బాగుంది. గతంలో రూ.లక్ష వరకు ఉండేది. పెంపుతో పొదుపు మహిళలు ఆర్థికంగా బలోపేతం కావడానికి ఉపయోగపడుతుంది. బయట అప్పులు తెచ్చుకొని చావుల దాకా వెళ్లేదానికన్నా మాకు రూ.3 లక్షలకు వడ్డీ లేకుండా రుణాలు ఇవ్వడం అభినందనీయం. ఈ ఐదేళ్లలో సున్నా వడ్డీ అమలు చేసి చూపాడు. ఇప్పుడు కూడా ఇస్తాడని మాకు నమ్మకం ఉంది.

– షంషాద్‌బేగం, ఆళ్లగడ్డ

'లా నేస్తం' కొనసాగించడం సంతోషం



నూతన మేనిఫెస్టోలో వైఎస్సార్ లా నేస్తం పథకం ద్వారా జూనియర్ న్యాయవాదులకు రూ.5వేలు స్టైయిఫండ్‌ను కొనసాగించడం సంతోషంగా ఉంది. ఆరు నెలలకు ఒకసారి రూ.30 వేలు ఇప్పటికే ప్రభుత్వం అందించింది. న్యాయవాదుల వెల్ఫేర్ ఫండ్ ద్వారా రూ.100 కోట్లు ఇప్పటికే కేటాయించారు. న్యాయవాదులకు అండగా నిలవాలనుకోవడం నిజంగా అభినందనీయం.

– శ్రీనివాసులు, న్యాయవాది, నంద్యాల

న్యాయం చేస్తారనే నమ్మకం ఉంది



సీఎం జగన్‌మోహన్‌రెడ్డి గత ఐదేళ్లలో నవరత్నాల ద్వారా ఇచ్చిన హామీలను నేరవేర్చాడు. మళ్లీ 2024లో ముఖ్యమంత్రి అయితే ఇప్పుడు ఇచ్చిన హామీలను కూడా నేరవేరుస్తారనే నమ్మకం ఉంది. పేదలకు మరింత మేలు చేకూరేలా మేనిఫెస్టో ఉంది. ప్రజల ఆశీర్వాదంతో జగనన్నే మళ్లీ సీఎం అవుతారు.

– శీలం మార్తమ్మ, గువ్వలకుంట్ల కొత్తపల్లి మండలం

అమ్మఒడి పెంపుతో విద్యాభివృద్ధి



జగనన్న అమ్మ ఒడి పథకం విద్యాభివృద్ధికి కృషి చేసింది. మా ఇంట్లో ముగ్గురు పిల్లలు బడికి పోతున్నారు. ఆ సొమ్ముతో పిల్లల బడి ఖర్చులన్నీ తీరతాయి. ఇప్పుడు మరో రెండు వేలు పెంచుతానంటున్నారు. ఆయన చెబితే కచ్చితంగా ఇచ్చి తీరతాడు. లేకపోతే మాట ఇవ్వడు.

– షేక్ ఆలియా, 3వ వార్డు నంద్యాల

ఇంజినీరింగ్ విద్యార్థి దుర్మరణం



మృతి చెందిన చక్రపాణి

చాగలమర్రి: నగళ్లపాడు గ్రామ సమీపంలోని భవనాసివాగులో కారు పడి నుజ్జునుజ్జయిన ఘటనలో చక్రపాణి (20) అనే ప్రొద్దుటూరు పట్టణానికి చెందిన ఇంజినీరింగ్ విద్యార్థి శనివారం మృతి చెందాడు. పోలీసులు తెలిపిన సమాచారం మేరకు.. వైఎస్సార్ జిల్లా, ప్రొద్దుటూరు పట్టణానికి చెందిన రామ్మోహన్, సుజాత దంపతుల ఏకైక కుమారుడు గండికోట చక్రపాణి (20) పట్టణంలోని ఎస్‌ఆర్‌ఐటీ ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. కుటుంబ పోషణలో భాగంగా కళాశాలకు సెలవులు వచ్చినపుడు కారు డ్రైవర్‌గా వెళ్లేవాడు. ప్రస్తుతం సెలవులు ఇవ్వడంతో ప్రొద్దుటూరు నుంచి ఆళ్లగడ్డకు బాడుగకు వెళ్లి తిరిగి వెళ్తుండగా నగళ్లపాడు సమీపంలో కారు వేగం అదుపు కాక డివైడర్‌ను ఢీ కొట్టి భవనాసి వాగులోకి ఎగిరి పడింది. డ్రైవింగ్ చేస్తున్న చక్రపాణి కారులోనే ఇరుక్కొని అక్కడికక్కడే మృతి చెందాడు. ఆళ్లగడ్డ రూరల్ సీఐ హనుమంతు నాయక్, ఎస్ఐ రమణయ్య టోల్ ప్లాజా సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకొని కారును క్రేన్ సహాయంతో బయటకు తీశారు. అందులో నుంచి సుమారు గంట సేపు శ్రమించి మృతదేహాన్ని బయటకు తీసి పోస్టుమార్టం నిమిత్తం ఆళ్లగడ్డకు తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వివరించారు.

గిరిజన గురుకుల కళాశాలలో ప్రవేశానికి ఆహ్వానం

శ్రీశైలంప్రాజెక్ట్: శ్రీశైలం ఐటీడీఏ పరిధిలోని నంద్యాల, పల్నాడు, ప్రకాశం జిల్లాల గిరిజన గురుకుల కళాశాలల్లో 2024-25 విద్యా సంవత్సరానికి ఇంటర్ ఇంగ్లిష్ మీడియంలో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రాజెక్ట్ అధికారి డాక్టర్.బి.రవీంద్రారెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీశైలంలోని బాలుర కళాశాలలో ఎంపీసీ, సీఈసీ, బైపీసీ గ్రూపులకు నంద్యాల, కర్నూలు, ప్రకాశం, కడప, గుంటూరుకు చెందిన ఎస్టీ విద్యార్థులకు 40 సీట్లు, అకౌంట్స్ అండ్ ట్యాక్సేషన్‌లో 20 సీట్లు కేటాయించినట్లు తెలిపారు. అలాగే పాణ్యం మండలం బలపనూరు బాలికల కళాశాలలో కర్నూలు, నంద్యాల, ప్రకాశం, అనంతపురం, కడప, గుంటూరు జిల్లాలకు చెందిన ఎస్టీ అభ్యర్థులకు ఎంపీసీ, బైపీసీ, సీఈసీ గ్రూపులలో 60 సీట్లు, అకౌంట్స్ అండ్ టాక్సేషన్‌లో కేవలం కర్నూలు జిల్లాకు చెందిన ఎస్టీ బాలికలకు 20 సీట్లు కేటాయించినట్లు ఆయన తెలిపారు. ప్రవేశాలలో మొదటి ప్రాధాన్యత చెంచు అభ్యర్థులకు ఉంటుందని, ఎంపీసీ, బైపీసీ, సీఈసీ గ్రూపులలో ఓసీ, బీసీ, ఎస్సీ ఏజెన్సీ ఉద్యోగుల పిల్లలకు ఒక్కోసీటు చొప్పున కేటాయించినట్లు ఆయన తెలిపారు. దరఖాస్తులను www. aptwrgurukulam. ap. gov లో సమర్పించాలని, దరఖాస్తు చివరి తేదీ మే 15 అని, వివరాలకు శ్రీశైలం ప్రిన్సిపాల్ 9490957268, 9494454357, 9701124919, బలపనూరు ప్రిన్సిపాల్ 9490957266, 9515702407 సంప్రదించాలని పీఓ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

ఆళ్లగడ్డ: పట్టణ శివారులోని జాతీయ రహదారిపై శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో శ్రీవాణి (30) మృత్యువాత పడింది. వైఎస్సార్ జిల్లా పెండ్లిమర్రి మండలం తిప్పిరెడ్డిపల్లెకు చెందిన శ్రీవాణి భర్త కృష్ణారెడ్డితో కలిసి పట్టణంలో జరుగుతున్న ఓ వివాహ కార్యక్రమానికి హాజరై తిరిగి మోటార్ సైకిల్‌పై స్వగ్రామానికి బయలుదేరారు. పట్టణ శివారులోని ఏపీ గోడౌన్ల సమీపంలోని అంతర్గత రోడ్డు నుంచి హైవే పైకి వెళ్లేసరికి వెనుక వైపు నుంచి వస్తున్న ప్రైవేటు బస్సు ఢీ కొట్టింది. దీంతో శ్రీవాణి అక్కడికక్కడే మృతి చెందగా భర్త కృష్ణారెడ్డి తీవ్రంగా గాయపడ్డాడు. క్షతగాత్రుడిని స్థానిక వైద్యశాలకు తరలించి మెరుగైన చికిత్స కోసం నంద్యాల వైద్యశాలకు తీసుకెళ్లారని సీఐ రమేష్‌బాబు తెలిపారు.

ట్రాక్టర్ ఢీ కొని వ్యక్తి మృతి

డోన్ రూరల్: వెంకటాపురం సమీపంలో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి దుర్మరణం చెందాడు. రూరల్ సీఐ అగ్రత్‌బాషా తెలిపిన వివరాల మేరకు.. పత్తికొండ మండలం ఎంజీ.తండా గ్రామానికి చెందిన శంకర్‌నాయక్ (47) శనివారం డోన్‌లో నిర్వహించే సంతకు వచ్చాడు. సంత చూసుకొని బైక్‌పై సొంత గ్రామానికి వెళ్తుండగా వెనుక నుంచి వస్తున్న ట్రాక్టర్ ఢీ కొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు మృతదేహాన్ని డోన్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతునికి భార్య లక్ష్మి, కూతురు, కొడుకు ఉన్నారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

నేడు ఏపీసెట్

కర్నూలు కల్చరల్: విశ్వవిద్యాలయాలు, డిగ్రీ కళాశాలల అధ్యాపకుల అర్హత పరీక్ష ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఎలిజిబిలిటీ టెస్ట్ (ఏపీసెట్) -2024ను ఆదివారం నిర్వహించనున్నారు. ఏర్పాట్లను ఏపీసెట్ రీజినల్ కో ఆర్డినేటర్, రాయలసీమ యూనివర్సిటీ రెక్టార్ ప్రొఫెసర్ ఎన్.టి.కె.నాయక్, స్పెషల్ అబ్జర్వర్, డాక్టర్ అబ్దుల్ హక్ ఉర్దూ యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ బాయినేని శ్రీనివాసు లు శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మొత్తం 3,883 మంది విద్యార్థులు పరీక్ష రానున్నారని తెలిపారు. రాయ లసీమ విశ్వవిద్యాలయం, కర్నూలు డాక్టర్స్ కాలనీలోని ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల, శ్రీ శంకరాస్ డిగ్రీ కళాశాల, కేవీఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల, సెయింట్ జోసఫ్స్ డిగ్రీ కళాశాల ఎ,బి సెంటర్‌లు, జి.పుల్లయ్య ఇంజినీరింగ్ కళాశాల, రవీంద్ర మహిళా ఇంజినీరింగ్ కళాశాల, నందికొట్కూరు రోడ్ సెయింట్ జోసెఫ్స్ మహిళా కళాశాలలో పరీక్ష జరుగుతుందన్నారు.

దేవుడి సొమ్ముకు లెక్కలు పక్కాగా ఉండాలి

- రాష్ట్ర దేవదాయశాఖ కమిషనర్ సత్యనారాయణ

కడప కల్చరల్: దేవునిసొమ్ముకు లెక్కలు పక్కాగా ఉండేలా సంబంధిత అధికారులంతా చర్యలు చేపట్టాలని రాష్ట్ర దేవదాయశాఖ కమిషనర్ ఎస్.సత్యనారాయణ అన్నారు. రాయలసీమ జోన్ దేవదాయశాఖ ఈఓలు, ఇన్‌స్పెక్టర్లు, ఇతర అధికారులు, ఉద్యోగుల విస్తృతస్థాయి సమావేశం శనివారం కడపలోని జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో నిర్వహించారు. జాయింట్ కమిషనర్ చంద్రశేఖర్ ఆజాద్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో కమిషనర్ సత్యనారాయణ మాట్లాడుతూ అధికారులు తమ పరిధిలోని 6ఏ-బి తదితర దేవాలయాలకు సంబంధించిన సమగ్ర సమాచారాన్ని కలిగి ఉండాలని సూచించారు. ఆలయాల ఆస్తులు, వాటి రిజిస్ట్రేషన్ వివరాలు, పబ్లికేషన్, దేవునికి సంబంధించిన నగలు, ఇతర ఆస్తులు ఆన్‌లైన్‌లో నమోదు చేసిన విషయాలను సంబంధిత ఈఓలు, ఇన్‌స్పెక్టర్లు, అసిస్టెంట్ కమిషనర్ల వద్ద సమాచారం ఉండేలా చూసుకోవాలన్నారు.

SHRIRAM Finance

శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్

సమోదిత కార్యాలయం : శ్రీ టవర్స్, ప్లాట్ నెం. 14ఎ, సౌత్ ఫేజ్, ఇండస్ట్రియల్ ఎస్టేట్, గిండి, చెన్నై-600032. Website: www.shriramfinance.in

బ్రాంచి ఆఫీస్ : డి.నెం. 40-384, 2వ అంతస్తు, యు కాన్ ప్లాజా, పార్క్ రోడ్డు, కర్నూలు. పిన్ కోడ్ - 518001

డిమాండ్ ప్రకటన

సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం 2002లోని సెక్షన్ 13 (2) క్రింద డిమాండ్ ప్రకటన

మెస్సర్స్ శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ (గతంలో 'శ్రీరామ్ సిటీ యూనియన్ ఫైనాన్స్ లిమిటెడ్' గా పిలువబడేది, ఎన్‌సిఎల్‌టి బెంచ్-II చెన్నై, తేది : 9-11-2022 యొక్క ఉత్తర్వుల ప్రకారం శ్రీరామ్ ట్రాన్స్‌పోర్ట్ ఫైనాన్స్ లిమిటెడ్‌లో విలీనమైనది మరియు శ్రీరామ్ ట్రాన్స్‌పోర్ట్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్‌గా మార్చబడినది) మరియు ఆ తర్వాత (30-11-2022 తేది నాటి కార్పొరేట్ ఫైనాన్స్ మంత్రిత్వశాఖ లేఖ) ద్వారా శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్‌గా తిరిగి పేరు పెట్టుటకు ఆమోదం పొందిన మేము కంపెనీల చట్టం, 2013 క్రింద రిజిస్టర్ కంపెనీ అయి ఉన్నాము. మరియు శ్రీ టవర్స్, ప్లాట్ నెం. 14ఎ, సౌత్ ఫేజ్, ఇండస్ట్రియల్ ఎస్టేట్, గిండి, చెన్నై-600032 వద్ద తన రిజిస్టర్డు ఆఫీసును మరియు బ్రాంచి ఆఫీస్ చిరునామా : డి.నెం. 40-384, 2వ అంతస్తు, యు కాన్ ప్లాజా, పార్క్ రోడ్డు, కర్నూలు. పిన్ కోడ్ - 518001 లో మరియు నాన్ బ్యాంకింగ్ ఫైనాన్స్ బ్యాంకింగ్ బిజినెస్‌ను నడుపుటకు ఆర్‌బిఐ వద్ద కూడా రిజిస్టరై ఉన్నాము. (ఇక నుండి మమ్మల్ని కంపెనీ / ఋణదాతగా సూచిస్తారు)

ఋణగ్రహీతలు / సహ ఋణగ్రహీతలు / హామీదార్లు / దిగువ తెలుపబడిన శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ నుండి ఆర్థిక సహాయాన్ని వినియోగించుకున్నారు. ఆర్థిక సహాయాన్ని వినియోగించుకొన్నప్పటికీ, గడువు తేదీల ప్రకారం వడ్డీ మరియు అసలు మొత్తాలను తిరిగి చెల్లించుటలో అనేక సార్లు ఋణగ్రహీతలు / హామీదార్లు విఫలమైనారని మేము తెలియజేస్తున్నాము. సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం 2002 క్రింద & సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 లోని రూలు 3తో చదువబడు సెక్షన్ 13 (2) క్రింద సంక్రమించిన అధికారాలను వినియోగించుకుంటూ శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ అధీకృత అధికారి సదరు ఖాతాను నిరర్థక ఆస్తిగా వర్గీకరించారు. నోటీసుల స్వీకరణ తేది నుండి 60 రోజులలోగా చెల్లింపు తేది వరకు నోటీసులలో తెలిపిన మొత్తంపై కాంట్రాక్చువల్ రేటున తదుపరి వడ్డీతోపాటు నోటీసులలో తెలిపిన మొత్తం మరియు అనుషంగిక ఖర్చులు, వ్యయాలు, ఛార్జీలు వగైరాలను చెల్లించవల్సిందిగా దిగువ తెలిపిన ఋణగ్రహీతలు / హామీదార్లు / తనఖాదారులను కోరుతూ సర్ఫేసి చట్టం 2002 లోని సెక్షన్ 13 (2) క్రింద ఇందులో తెలిపిన సంబంధిత తేదీలలో డిమాండ్ నోటీసులు జారీచేశారు.

చివరిగా తెలిసిన వారి చిరునామాలోని వారికి జారీ చేయబడిన నోటీసులు అందచేయబడక తిరిగి వచ్చినందున సదరు విషయం గురించి బహిరంగ ప్రకటన రూపంలో వారికి సమాచారం ఇవ్వడమైనది. సెక్యూర్డ్ ఆస్తులను విడిపించుకొనుటకు లభించు సమయానికి సంబంధిత చట్టంలోని సెక్షన్ 13 యొక్క సబ్ సెక్షన్ (8) నిబంధనలను గమనించవల్సిందిగా ఋణగ్రహీతలకు విజ్ఞప్తి.

క్ర. సం.	ఋణగ్రహీత (లు) / సహ-ఋణగ్రహీత (లు) / హామీదారు (లు) పేరు	NPA తేది / ఋణ మొత్తం	డిమాండ్ నోటీసు తేది / బకాయి మొత్తం
1	1) తులసీ కుమారి లింగాల, భర్త : కుమార్, ఎల్, హెచ్.నెం. 15-9యం/5ఎ-4/2, హాజీ నగర్, నందికొట్కూరు, కర్నూలు జిల్లా - 518401. 2) కుమార్ బోలెద్దుల, తండ్రి : వి. నాగన్న, హెచ్.నెం. 15-9యం/5ఎ-4/2, హాజీ నగర్, నందికొట్కూరు, కర్నూలు జిల్లా - 518401. 3) మౌలాలి పింజరి, తండ్రి : పి. బాబు సాహెబ్, హెచ్.నెం. 22-48/29/బి, కుమ్మరి వీధి, నందికొట్కూరు, కర్నూలు జిల్లా - 518401.	08-02-2023 / Rs. 20,00,000/-	18-12-2023 / ది. 18-12-2023 నాటికి రూ. 30,30,462/- (అక్షరాలా ముప్పై లక్షల ముప్పై వేల నాలుగు వందల అరవై రెండు రూపాయలు మాత్రమే) లోన్ అగ్రిమెంట్ నెం. KURN2TF2108310007
	ఆస్తి వివరములు : కర్నూలు జిల్లా, నందికొట్కూరు సబ్ డిస్ట్రిక్ట్, నందికొట్కూరు మండలం, నందికొట్కూరు టౌన్ & మున్సిపాలిటీ, నందికొట్కూరు గ్రామ అకౌంట్స్, హాజీనగర్, సర్వే నెం. 808, డి.నెం. 15-9యం/5-4, కొత్త డి.నెం. 13-671 వద్ద ఇల్లు మరియు ఖాళీ స్థలము. హద్దులు : తూర్పు : వీరయ్య ఆచార్య గారి ఇల్లు, పడమర: వెంకట శివయ్య గారి ఇల్లు, ఉత్తరం : యం. జోజమ్మ గారి ఇల్లు, దక్షిణం : రోడ్డు. పై సరిహద్దుల మధ్య తూర్పు నుండి పడమరకు 15 1/2 అ॥ మరియు ఉత్తరం నుండి దక్షిణంకు 46 1/2 అ॥ కలుపగా మొత్తం 80.08 చ॥గ॥ల స్థలము మరియు అందలి నిర్మించిన కడప స్లాబ్ తో కూడిన గ్రౌండ్ ఫ్లోర్ (తూర్పు నుండి పడమర 15 1/2 అ॥ మరియు ఉత్తరం నుండి దక్షిణంకు 32 1/2 అ॥ కలుపగా మొత్తం 503.75 చ॥అ॥లు) మరియు ఫస్ట్ ఫ్లోర్ (తూర్పు నుండి పడమర కు 15 1/2 అ॥ మరియు ఉత్తరం నుండి దక్షిణంకు 23అ॥ మొత్తం కలుపగా 356.5 చ॥అ॥) మరియు అన్ని సౌలభ్య హక్కులతోసహా స్థలం.		

పైన చెప్పబడిన పరిస్థితుల దృష్ట్యా, ఈ నోటీసు ప్రచురణ తేది నుండి 60 రోజులలోగా భవిష్యత్ వడ్డీ మరియు వర్తించు ఛార్జీలతోపాటు పైన తెలిపిన విధంగా బకాయి మొత్తాలను చెల్లించవల్సిందిగా పైన తెలిపిన ఋణగ్రహీతలు, సహ ఋణగ్రహీతలు మరియు /లేదా వారి హామీదారుల (వర్తించినచోట) కు ఇందుమూలంగా నోటీసు ఇవ్వడమైనది. లేనిచో, సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం 2002లోని సెక్షన్ 13 (4) క్రింద మరియు ఇందులో వర్తించు నిబంధనల క్రింద ఋణగ్రహీతలు మరియు తనఖా ఋణగ్రస్తుల యొక్క సెక్యూర్డ్ ఆస్తులు స్వాధీనత చేపట్టడంతో కలుపుకొని సెక్యూర్డ్ అసెట్స్ మీద ఈ నోటీసు తేది నుండి 60 రోజుల అనంతరం తదుపరి చర్యలు చేపట్టబడును.

సదరు చట్టంలోని సెక్షన్ 13 (13) క్రింద, సెక్యూర్డ్ క్రెడిటార్ యొక్క ముందస్తు, వ్రాత పూర్వక సమ్మతి లేకుండా నోటీసులో తెలిపిన ఆతని సెక్యూర్డ్ అస్సెట్స్‌ను అమ్మకం, లీజు లేదా మరేదేని రూపంలో ఏ ఋణగ్రహీతా బదిలీ చేయరాదని గమనించగలరు.

ప్రదేశం : కర్నూలు సం/- అధీకృత అధికారి, శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్.

SHRIRAM Finance

శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్

సమోదిత కార్యాలయం : శ్రీ టవర్స్, ప్లాట్ నెం. 14ఎ, సౌత్ ఫేజ్, ఇండస్ట్రియల్ ఎస్టేట్, గిండి, చెన్నై-600032. Website: www.shriramfinance.in

బ్రాంచి ఆఫీస్ : డి.నెం. 50-760-114ఎ, 2వ అంతస్తు, శాంసంగ్ స్మార్ట్ ప్లాజా పైన, గాయత్రి ఎస్టేట్, గుత్తి రోడ్డు, కర్నూలు.

డిమాండ్ ప్రకటన

సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం 2002లోని సెక్షన్ 13 (2) క్రింద డిమాండ్ ప్రకటన

మెస్సర్స్ శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ (గతంలో 'శ్రీరామ్ సిటీ యూనియన్ ఫైనాన్స్ లిమిటెడ్' గా పిలువబడేది, ఎన్‌సిఎల్‌టి బెంచ్-II చెన్నై, తేది : 9-11-2022 యొక్క ఉత్తర్వుల ప్రకారం శ్రీరామ్ ట్రాన్స్‌పోర్ట్ ఫైనాన్స్ లిమిటెడ్‌లో విలీనమైనది మరియు శ్రీరామ్ ట్రాన్స్‌పోర్ట్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్‌గా మార్చబడినది) మరియు ఆ తర్వాత (30-11-2022 తేది నాటి కార్పొరేట్ ఫైనాన్స్ మంత్రిత్వశాఖ లేఖ) ద్వారా శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్‌గా తిరిగి పేరు పెట్టుటకు ఆమోదం పొందిన మేము కంపెనీల చట్టం, 2013 క్రింద రిజిస్టర్ కంపెనీ అయి ఉన్నాము. మరియు శ్రీ టవర్స్, ప్లాట్ నెం. 14ఎ, సౌత్ ఫేజ్, ఇండస్ట్రియల్ ఎస్టేట్, గిండి, చెన్నై-600032 వద్ద తన రిజిస్టర్డు ఆఫీసును మరియు బ్రాంచి ఆఫీస్ చిరునామా : డి.నెం. 50-760-114ఎ, 2వ అంతస్తు, శాంసంగ్ స్మార్ట్ ప్లాజా పైన, గాయత్రి ఎస్టేట్, గుత్తి రోడ్డు, కర్నూలు. లో మరియు నాన్ బ్యాంకింగ్ ఫైనాన్స్ బ్యాంకింగ్ బిజినెస్‌ను నడుపుటకు ఆర్‌బిఐ వద్ద కూడా రిజిస్టరై ఉన్నాము. (ఇక నుండి మమ్మల్ని కంపెనీ / ఋణదాతగా సూచిస్తారు)

ఋణగ్రహీతలు / సహ ఋణగ్రహీతలు / హామీదార్లు / దిగువ తెలుపబడిన శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ నుండి ఆర్థిక సహాయాన్ని వినియోగించుకున్నారు. ఆర్థిక సహాయాన్ని వినియోగించుకొన్నప్పటికీ, గడువు తేదీల ప్రకారం వడ్డీ మరియు అసలు మొత్తాలను తిరిగి చెల్లించుటలో అనేక సార్లు ఋణగ్రహీతలు / హామీదార్లు విఫలమైనారని మేము తెలియజేస్తున్నాము. సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం 2002 క్రింద & సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 లోని రూలు 3తో చదువబడు సెక్షన్ 13 (2) క్రింద సంక్రమించిన అధికారాలను వినియోగించుకుంటూ శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ అధీకృత అధికారి సదరు ఖాతాను నిరర్థక ఆస్తిగా వర్గీకరించారు. నోటీసుల స్వీకరణ తేది నుండి 60 రోజులలోగా చెల్లింపు తేది వరకు నోటీసులలో తెలిపిన మొత్తంపై కాంట్రాక్చువల్ రేటున తదుపరి వడ్డీతోపాటు నోటీసులలో తెలిపిన మొత్తం మరియు అనుషంగిక ఖర్చులు, వ్యయాలు, ఛార్జీలు వగైరాలను చెల్లించవల్సిందిగా దిగువ తెలిపిన ఋణగ్రహీతలు / హామీదార్లు / తనఖాదారులను కోరుతూ సర్ఫేసి చట్టం 2002 లోని సెక్షన్ 13 (2) క్రింద ఇందులో తెలిపిన సంబంధిత తేదీలలో డిమాండ్ నోటీసులు జారీచేశారు.

చివరిగా తెలిసిన వారి చిరునామాలోని వారికి జారీ చేయబడిన నోటీసులు అందచేయబడక తిరిగి వచ్చినందున సదరు విషయం గురించి బహిరంగ ప్రకటన రూపంలో వారికి సమాచారం ఇవ్వడమైనది. సెక్యూర్డ్ ఆస్తులను విడిపించుకొనుటకు లభించు సమయానికి సంబంధిత చట్టంలోని సెక్షన్ 13 యొక్క సబ్ సెక్షన్ (8) నిబంధనలను గమనించవల్సిందిగా ఋణగ్రహీతలకు విజ్ఞప్తి.

క్ర. సం.	ఋణగ్రహీత (లు) / సహ-ఋణగ్రహీత (లు) / హామీదారు (లు) పేరు	NPA తేది / ఋణ మొత్తం	డిమాండ్ నోటీసు తేది / బకాయి మొత్తం
1	1) పద్మావతి బోయ, భర్త : మధు బోయ, హెచ్.నెం. 9-146-3, కొత్తపేట, డోన్, కర్నూలు జిల్లా - 518222. 2) మధు బోయ, తండ్రి : బి. శ్రీరాములు, హెచ్.నెం. 9-146-3, కొత్తపేట, డోన్, కర్నూలు జిల్లా - 518222. 3) సి. మధుసూధనరావు, తండ్రి : సి. చంద్రశేఖర్, హెచ్.నెం. 6-821-27, టీచర్స్ కాలనీ, డోన్, కర్నూలు జిల్లా - 518222.	08-10-2022 / Rs. 35,00,000/-	18-12-2023 / ది. 18-12-2023 నాటికి రూ. 56,03,591/- (అక్షరాలా యాభై ఆరు లక్షల మూడు వేల ఐదు వందల తొంభై ఒక్క రూపాయి మాత్రమే) లోన్ అగ్రిమెంట్ నెం. KURN4TF2106260006
	ఆస్తి వివరములు : కర్నూలు జిల్లా, డోన్ సబ్ డిస్ట్రిక్ట్, డోన్ మండలం, డోన్ టౌన్ & మున్సిపాలిటీ, డోన్ గ్రామ అకౌంట్స్, సర్కారు డ్రై సర్వే నెం. 240/1, కొత్తపేట, రాఘవేంద్రస్వామి గుడి వీధి, ఇంటి డి.నెం. 9-146/3బి అసెస్‌మెంట్ నెం. 1125007373, ఇంటి నెం. 9-146/4బి అసెస్‌మెంట్ నెం. 1125007379. హద్దులు : తూర్పు : శ్రీరాములు గారి ఇల్లు, పడమర : శ్రీరాములు గారి ఇల్లు, ఉత్తరం : రాస్తా (రోడ్డు), దక్షిణం : సోమన్న గౌడ్ మరియు రంగడు గార్ల ఇల్లు. పై సరిహద్దుల మధ్య తూర్పు నుండి పడమరకు ఉత్తర భాగాన 9 1/2 గ॥, తూర్పునుండి పడమరకు దక్షిణ భాగాన 9 గ॥ మరియు ఉత్తరం నుండి దక్షిణాన రెండు వైపులా 14 గ॥ మొత్తం కలుపగా 129.5 చ॥గ॥ల స్థలము మరియు అందలి నిర్మించిన ఆర్‌సిసి బిల్డింగ్ కి తూర్పు నుండి పడమరకు ఉత్తరం వైపున 28 1/2 అ॥, తూర్పు నుండి పడమరకు దక్షిణం వైపుకి 27 అ॥ మరియు ఉత్తరం నుండి దక్షిణంకు రెండు వైపులా 42 అ॥ మొత్తం కలుపగా 1165.5 చ॥అ॥ల విస్తీర్ణంలోని బిల్డింగ్ దానికి చెందిన అన్ని ఫిక్చర్స్ మరియు సౌలభ్య హక్కులతో సహా స్థలము.		

పైన చెప్పబడిన పరిస్థితుల దృష్ట్యా, ఈ నోటీసు ప్రచురణ తేది నుండి 60 రోజులలోగా భవిష్యత్ వడ్డీ మరియు వర్తించు ఛార్జీలతోపాటు పైన తెలిపిన విధంగా బకాయి మొత్తాలను చెల్లించవల్సిందిగా పైన తెలిపిన ఋణగ్రహీతలు, సహ ఋణగ్రహీతలు మరియు /లేదా వారి హామీదారుల (వర్తించినచోట) కు ఇందుమూలంగా నోటీసు ఇవ్వడమైనది. లేనిచో, సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం 2002లోని సెక్షన్ 13 (4) క్రింద మరియు ఇందులో వర్తించు నిబంధనల క్రింద ఋణగ్రహీతలు మరియు తనఖా ఋణగ్రస్తుల యొక్క సెక్యూర్డ్ ఆస్తులు స్వాధీనత చేపట్టడంతో కలుపుకొని సెక్యూర్డ్ అసెట్స్ మీద ఈ నోటీసు తేది నుండి 60 రోజుల అనంతరం తదుపరి చర్యలు చేపట్టబడును.

సదరు చట్టంలోని సెక్షన్ 13 (13) క్రింద, సెక్యూర్డ్ క్రెడిటార్ యొక్క ముందస్తు, వ్రాత పూర్వక సమ్మతి లేకుండా నోటీసులో తెలిపిన ఆతని సెక్యూర్డ్ అస్సెట్స్‌ను అమ్మకం, లీజు లేదా మరేదేని రూపంలో ఏ ఋణగ్రహీతా బదిలీ చేయరాదని గమనించగలరు.

ప్రదేశం : కర్నూలు సం/- అధీకృత అధికారి, శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్.